



# స్లైలు వైరాగ్యం

జ్యోతిర్మయి

వేసవి సెలవులకి అత్తగారి ఊరు వెళ్ళాము. నలుగురు అన్నదమ్ముల్లో మావారు ఒక్కరే పై ఊళ్ళో ఉద్యోగం. మిగతా అందరూ ఇక్కడే ఉమ్మడి కుటుంబం. మధ్యాహ్నం ఎండ వేళ. సెలవులు పెట్టుకున్న మగవాళ్ళతో సహా అందరూ ఎండకి నిద్దర్లు పోతున్నారు. భోజనాలు కానిచ్చి పగటి నిద్ర అలవాటు లేక చేతికి దొరికిన పుస్తకం తీసుకుని విశ్రాంతిగా నడుం వాల్చాను. కింద చాప మీద చంటి పిల్లవాడిని జోకొడుతూ కూర్చుంది మా ఆఖరి తోడికోడలు- ఆడబడుచు కూతురు కూడాను- పద్మ. పుస్తకం మూసి గట్టిగా నిట్టూర్చాను.

"అంతలా నిట్టూర్చావేమిటి అత్తా" అంది పద్మ చనువుగా.

"ఏమిటో పద్మా. ఈమధ్య చూసిన ఒకటి రెండు చావులు, చదువుతున్న కథలు వైరాగ్యం పెంచేస్తున్నాయి నాలో. పుస్తకాలన్నీ దయ్యాలు, ప్రేతాలు కథలే. పొద్దున లేచిన దగ్గర్నుంచీ ఎంత తాపత్రయ పడిపోతాం! కన్ను మూస్తే ఏమీ తెలియదు. అయినా అలా కొట్టుకుంటూనే వుంటాము. ఏ పని చేస్తున్నా-ఈ పని చెయ్యకపోతే ఏమి- అనిపిస్తుంటుంది. ఒక్కొక్కసారి భయమేస్తుంది. ఇన్ని బంధాలు పెంచుకుని, జీవితం అంటే ఇంత తీపి పెంచుకుంటాం, తర్వాత ఏమవుతాం మనం? ఎక్కడికి వెళ్ళిపోతాం?" అన్నది నా వైపు చూస్తూ..

"నిజమే అత్తా. నువ్వు ఇంతలా చెప్తుంటే నాకూ అనిపిస్తోంది. ఈ పిల్లవాడి మీద ఇంత మమకారం పెంచుకుంటాం. వీడిని పెంచుతాం. వాడు అనుకున్నట్టు పెరగకపోతే నిరాశ పడతాం. ఇవన్నీ ఎందుకు? ఎవరికి ఎవరం?" అంది.

ఆ పిల్ల మాటలకి భయమేసింది. 'ఇంత చిన్న పిల్లకి ఇలాంటి కబుర్లు చెప్తున్నానేమిటి?' అనుకున్నాను. ఇంకా ఏదో అంటోంది-

"ఎవరి ప్రాణాలూ పట్టుకుని ఆపలేం. అయినా ఎంత ఆరాటం? ఇలా ఆలోచిస్తుంటే విస్త్రాణ వస్తుంది. ఒక చీర అన్నా, నగ అన్నా ఆసక్తి పోతుంది, ఇవన్నీ తగిలించుకుని ఏం చేస్తాం అని. ఏది కట్టుకుంటే రోజు గడిచిపోదు?"

పద్మ నన్ను మించిపోయింది. ఎవరితోనన్నా నేనిలాంటి మాటలు మాట్లాడితే, అందరూ నన్ను పిచ్చిదానిలా చూసేవారు. 'ఈ వయస్సులో ఈ కబుర్లు ఎందుకు లెద్దురూ. ఇంకా టైముంది దానికి. హాయిగా జితేంద్ర, శ్రీదేవి సినిమాకి పోతే

తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) ఉగాది మినీ కథల పోటీలో రు. 300 గెలుపొందిన రచన



## జీవిత వివరాలు

పుట్టింది మదరాసులో. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి బి.ఎస్‌సి. డిగ్రీ. వివాహమయిన దగ్గర్నుంచీ నాగపూర్ నివాసం. ఇద్దరమ్మాయిలు. '85 నుంచి కథలు రాస్తున్నాను. బహుమతి అందుకోవడం ఇది మూడోసారి.

—బి.జ్యోతి, నాగపూర్

అన్ని వైరాగ్యాలు వదిలిపోతాయి' అనేవాడు గాని ఇలా వంత పాడిన వాళ్ళు ఎవరూ లేరు.

పిల్లవాడి నిద్ర పాడవుతుందని మాట్లాడకుండా ఆలోచిస్తూ ఉండిపోయాను. తట్టి పిలుస్తున్నట్టు అనిపిస్తే గబుక్కున పక్కకి తిరిగాను. నోటి మీద వేలుంచి మాట్లాడవద్దని సైగ చేస్తూ కింద పడుకున్న పిల్లవాడి వైపు చూపించి, లేచి రమ్మన్నట్టు చెయ్యి ఆడించింది. నాకేమీ అర్థం కాలేదు. లేచిన దాన్ని, నన్ను పట్టుకుని చప్పుడు కాకుండా వీధి తలుపు తీసి గేటు దగ్గరకి లాక్కుని వెళ్ళింది. నాకు అంతా అయోమయంగా వుంది.

"అబ్బ-ఎన్ని రోజులయిందో? రోజూ వీడిని పిలవాలనుకుంటాను. మధ్యాహ్నం పూట అందరూ నిద్ర పోతారు. ఎవరూ తోడు ఉండరు. ఈ పిల్లవాడితో ఏదో పనిలో వుండిపోతుంటాను. నీవు వున్నావు ఇవాళ తోడు" అంటూ గబగబా చెప్పి, రోడ్డు మీద స్టీలు సామాన్లు బండి మీద పెట్టుకుని పోతున్న కుర్రాడిని కేకేసింది.

"ఏ వస్తువయినా అయిదు రూపాయిలేనట. ఈ చిన్న బౌల్స్ చూశావా? ఎన్నాళ్ళ నుంచో చూస్తున్నాను కిటికీ లోంచి. టేబిల్ మీద పెట్టుకునేందుకు బాగుంటాయి కదూ. ఈయనకి ట్రాన్స్‌ఫర్ అయిపోతుందట. మాకూ సామాను కావాలి కదా. పక్కాగా బల్ల మీద సర్ది పెట్టుకోవచ్చు" అంటూ పరవశంగా వాటని చూస్తోంది.

నా దృష్టి గ్లాసుల మీద పడింది. ఒకే సెట్టు గ్లాసులు డజను ఉండాలని ఎప్పట్నించో సరదా. తీరనే లేదు. ఎవరయినా వస్తే అన్నీ ఒక్కలాంటివి పెట్టొచ్చు. చవగ్గా కూడా వున్నాయి.

"గ్లాసులు ఎలా ఇస్తావు అబ్బాయి? డజను తీసుకుంటాను. నాలుగు రూపాయిలు వేసుకో" అన్నాను. వాడు కుదరదన్నాడు. అయినా పట్టి అడిగాను.

"చూడబ్బాయి. దీని మూత కొంచెం సొట్ట పోయింది. ఇది కూడా నాలుగు రూపాయిలు వేసుకో. నాలుగు తీసుకుంటాము" అంటోంది పద్మ.

మా ఇద్దరి బేరాలు చూస్తున్న నాకు ఒక్కసారి ఫక్కుమని నవ్వొచ్చింది. 'అయిదు నిమిషాలవలేదు ఇద్దరం ఎక్కడలేని వైరాగ్యం, విరక్తి కబుర్లు చెప్పుకున్నాం. ఇపుడిక్కడ చవగ్గా స్టీలు సామాన్లు అనేసరికి పరుగెత్తుకుని రావడమే కాదు, వెధవ రూపాయి కోసం బేరం కూడాను. అదేం మాయ కమ్మేసిందో? ఎక్కడి వైరాగ్యం అక్కడే ఎగిరి పోయింది.'

నా నవ్వు చూసి అర్థం కాక బిత్తరపోయి చూసి పద్మ "ఎందుకత్తా అంత నవ్వు?" అంది.

"ఏమీ లేదు. మన స్టీలు వైరాగ్యానికి నవ్వొస్తోంది" అన్నాను వచ్చే నవ్వును ఆపుకుంటూ, ఆ సామాన్ల కుర్రాడు ఏమనుకుంటాడోనని. ●

## సంచిక 10-4-87లో ప్రచురించిన

## 'మమ్మీ! నాకు అమ్మ కావాలి' మినీకథ రచయిత స్వపరిచయం



వయస్సు 27 సం.లు. విజయనగరంలో బి.ఎస్‌సి. డిగ్రీతో పాటు రచనా వ్యాసంగం సంపాదించాను. అయిదేళ్ళ నుండి కమలాపురంలోని ఎ.పి. రేయాన్స్‌లో జూనియర్ అసిస్టెంటుగా ఉద్యోగం.

రాసి కంటే వాసి ముఖ్యమనుకునే చిరు రచయితను. ఇంతవరకు 50 కథలు, రెండు సీరియల్ నవలలు, రెండు అనుబంధ నవలలు వివిధ వార మాస పత్రిక లలో ప్రచురింపబడ్డాయి. కొన్ని కథలు హిందీ, కన్నడ భాషల్లోకి అనువదింపబడ్డాయి. నా మొదటి కథ, నా మొదటి నవల సీరియల్‌గా ప్రచురించింది ఆంధ్ర పత్రిక వారపత్రిక. మొదటిసారిగా నాకు బహుమతి 1981 దీపావళి ఆంధ్ర పత్రిక వారపత్రిక కథల పోటీలో వచ్చింది. ఇది నా రెండవ బహుమతి కథ. ఆంధ్రజ్యోతి వారపత్రికలో ఇది రెండవ కథ కూడా!

— కంచుమర్తి వెంకటేశ్వరరావు

కమలాపురం


బోయ జంగయ్య నవలిక

జాతర

వస్తుంది త్వరలో